క్లుప్తంగా

పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ – ఆంధ్రా చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి.. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న షేక్ ఖాసీమ్

కొణిజర్ల: ప్రభుత్వం తక్షణమే సాగర్ జలాలను విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొణిజర్లలో రైతుకూలీ సంఘం మండల కమిటీ సమావేశం రొంటె గంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఓట్లు, సీట్లపై ఉన్న ధ్యాస రైతులపై లేదన్నారు. జిల్లాలో పలు గ్రామాల్లో సాగు నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. తాగునీటి పేరుతో పంటలకు సాగు నీరందించక పోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంగోత్ బాషా, బంటు లచ్చన్న, బాలు, దస్రు, కిషన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా ప్రారంభం

సత్తుపల్లిటౌన్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యాన టీఎస్ ఆర్టీసీ నిర్వహిస్తోన్న లక్కీ డ్రా బుధవారం నుంచి ప్రారంభమైందని ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30 వరకు కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాక టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి వాటిని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రా బాక్సుల్లో వేయాలని సూచించారు. బస్టాండ్, ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా డ్రా బాక్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లాభాల వాటా ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ జాయింట్ కార్యదర్శి భరణి

సత్తుపల్లి: కిష్టారంలో ఓసీలో బుధవారం బ్రాంచ్ జాయింట్ కార్యదర్శి భరణి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ అజ్మద్ ఆధ్వర్యాన ఏఐటీయూసీ గేట్ మీటింగ్ జరిగింది. యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మికులకు రావాల్సిన 32 శాతం లాభాల వాటా, దసరా అడ్వాన్స్ వెంటనే ఇవ్వాలని కిష్టారం ఓసీ మేనేజర్ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ట్రేడ్స్ మైన్స్ ఇన్‌చార్జ్ సాంబశివరావు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ గంగాధరణి నాగేశ్వరరావు, ఏరియా బాధ్యులు రవి, కార్మికులు పాల్గొన్నారు.

పదోన్నతులు రావడం గర్వకారణం

సత్తుపల్లి: సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నుంచి నలుగురు అంగన్‌వాడీ టీచర్లకు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడం ప్రాజెక్టుకే గర్వకారణమని సీడీపీఓ ఎ.కొండమ్మ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లుగా పని చేస్తూ 2022 నవంబర్‌లో విడుదలైన పరీక్ష ఫలితాల్లో సూపర్‌వైజర్లుగా పదోన్నతి పొంది వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సంధ్యారాణి, సుజాత, వరలక్ష్మి, రఘుపతిలను పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, భవాని, రజని, కమల, సుజాత, రమాదేవి, జూనియర్ అసిస్టెంట్ సాదం శ్రీనివాసరావు, విజయ్, పోషణ అభిమాన్ ప్రసాద్, శిరీష, అటెండర్ ఖాజా పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

వైరారూరల్: ఎస్సీల హక్కుల సాధనకై నవంబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించే యుద్ధ భేరి మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని పాలడుగు గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు వర్గీకరణ చేయకుండా ఎస్సీలను మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ భూమి, ఇల్లు లేని నిరుపేదలకు దళితబంధు పథకాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మోదుగు రాజు, గద్దల వేణు బాబు, మోదుగు రాజశేఖర్, కె. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

గుడిసెల్లోనే బతుకులు

- ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- 'గృహలక్ష్మి'లో కూడా దక్కని చోటు
- పార్టీలకతీతంగా అందించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకులు మారిన పేదల తలరాతలు మాత్రం మారడం లేదు. సొంతింటి కల నెరవేరక, గుడిసెల్లోనే పేదల బతుకులు తెల్లారిపోతున్నాయి. ఓ పక్క వర్షానికి తడుస్తూ, మరో పక్క ఎండకు ఎండుతూ.. గాలిదుమారం వస్తే ఇంటి పై కప్పులు ఎగిరిపోతూ.. అయినా బతుకు జీవుడా అనుకుంటూ గుడిసెల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. ఈ సారైన ప్రభుత్వం ఇల్లు ఇవ్వకపోదా.. అనుకొని సొంతింటి కల నెరవేరుతుందో నని పేదలు ఎదురు చూస్తున్నారు.

కారేపల్లి: మండలంలో 41 గ్రామ పంచాయతీలగాను, 105 శివారు గ్రామాలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం ద్వారా పేదలకు రూ.3లక్షల చొప్పున కేటాయించి, సొంతింటి కల నెరవేర్చేందేకు పూనుకుంది. దీనికి సంబంధించి, గత ఆగస్ట్‌లోనే గ్రామ కార్యదర్శులు సర్వే చేపట్టి 2,756 మంది పేదలు గృహలక్ష్మి పథకానికి అర్హులని గుర్తించారు. దీనికి సంబంధించిన అర్హుల జాబితాను జిల్లా స్థాయి అధికారులకు సైతం నివేదించారు.



తులిస్యాతండా గ్రామంలో 'గృహలక్ష్మి' మంజూరు కాని కుటుంబం

గృహలక్ష్మిలో దక్కని చోటు..

గృహలక్ష్మి పథకం ద్వారా సర్వేలో అర్హులుగా గుర్తించిన పేదలకే ఇల్లు మంజూరు అవుతాయని ఆశపడిన లబ్ధిదారులకు నిరాశేమిగిలింది. గ్రామ కార్యదర్శులు అర్హులుగా గుర్తించిన 2,756 మంది నిరుపేదల జాబితాను అటకెక్కించిన అధికారులు, రాజకీయ నాయకుల ప్రోద్బలంతో.. స్థానిక అధికారులు ఎలాంటి అర్హత లేని, తమకు కావాల్సిన వారికి, మరికొంత మంది వద్ద డబ్బులు తీసుకొని గృహలక్ష్మి జాబితాను తయారు చేసినట్లు విమర్శలు సైతం ఉన్నాయి.

ప్రకటించిన మొదటి జాబితాలో..

ఇటీవల మండల వ్యాప్తంగా 485 మందిని అర్హులుగా గుర్తించి గృహలక్ష్మి జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో గతంలో గ్రామ కార్యదర్శులు సర్వే చేసి అర్హులుగా గుర్తించిన వారి పేర్లు లేక పోవటంతో.. గందరగోళం నెలకొంది. భవనాలు, చేన్లు చెలకలు, కార్లు, ట్రాక్టర్లు ఉన్న వారికి గృహలక్ష్మి ఇల్లు మంజూరు చేస్తు.. జాబితా విడుదల కావటంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



కారేపల్లిలోని ఓ నిరుపేద కుటుంబం

ఇటీవల జరిగిన ఆందోళన..

ఉన్నవారికే ఇళ్ల ఇస్తారా అంటూ.. పలు గ్రామాల నిరుపేదలు ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి పట్టాల పంపిణీని అడ్డుకుని ఆందోళన చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను నిలదీస్తూ, వాగ్వావానికి దిగిన ఘటనలు లేక పోలేదు. ఇదిలా ఉండగా.. కారేపల్లిలో ఒకే కుటుంబంలో భర్తకు దళిత బంధు, భార్యకు గృహలక్ష్మి, మరొక కుటుంబంలో భర్తకు బీసీ బంధు, భార్యకు గృహలక్ష్మి పథకాలు మంజూరు కావటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టానుసారంగా పలుకుబడి ఉన్న వారికే ప్రభుత్వ పథకాలు మంజూరు అయ్యేలా అవినీతికి పాల్పడ్డారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



భాగ్యనగర్‌తండాలో సర్వే చేస్తున్న గ్రామ కార్యదర్శి సురేష్ (ఫైల్)



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న భాగ్యనగర్‌తండా వాసులు (ఫైల్)

గృహలక్ష్మి వస్తుందని ఆశపడ్డా..



కారేపల్లి: గృహలక్ష్మి ద్వారా మాకు ఇల్లు మంజూరు అవుతుందని ఆశపడ్డా. కూలీనాలీ చేసుకొని బతికే మాలాంటి పేదోళ్లకు ప్రభుత్వం వారు ఇల్లు ఇస్తే బాగుంటుంది. చుట్టూ తడికలు కట్టుకొని పైన రేకులు వేసుకొని బతుకుతున్నాం. సెక్రటరీ మేడం వచ్చి సర్వే చేసి మా పేర్లు రాసుకొని వెళ్లింది. అయినా గృహలక్ష్మిలో మా పేరు రాలేదు. మాలాంటోళ్లను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మిడిదొడ్డి నాగమణి, కారేపల్లి

ఆన్‌లైన్‌లో కరెంట్ బిల్లులు చెల్లించండి



తల్లాడ: కుర్నవల్లిలో.. అవగాహన కల్పిస్తున్న తల్లాడ ఏడీఈ ఖాదార్‌బాబా

తల్లాడ/వేంసూరు: విద్యుత్ బిల్లులను ప్రజలందరూ ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని తల్లాడ విద్యుత్ శాఖ ఏడీఈ ఎస్‌కే.ఖాదర్ బాబా, వేంసూరు ట్రాన్స్‌కో ఏఈ అంకారావు అన్నారు. బుధవారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, కుర్నవల్లి గ్రామాల్లో, వేంసూరులో.. ఆన్‌లైన్‌లో విద్యుత్ చెల్లింపుల విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ చెల్లింపుతో అమూల్యమైన సమయం ఆదా అవడంతో పాటు, లైన్‌లో నిలబడే అవసరం కూడా ఉండదన్నారు. ఆన్‌లైన్ విధానంలో లేదా ఫోన్ పే, గూగుల్‌పే లేదా వాలెట్, బిల్ డెస్క్ యాప్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ప్రతి నెలా వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తల్లాడ, కుర్నవల్లి ఏఈలు రాజేష్, సుందర్‌కుమార్, ఏఈ అనీల్, విద్యుత్‌శాఖ సిబ్బంది రాజారావు, రమణారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్‌పై అవగాహన



కారేపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్సై రామారావు



సత్తుపల్లిటౌన్: రంగవల్లులతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కారేపల్లి/సత్తుపల్లిటౌన్: సీ విజిల్ యాప్‌ను మీ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదులు చేయాలని సింగరేణి ఎంపీడీఓ చంద్రశేఖర్, కమిషనర్ కె.సుజాత అన్నారు. బుధవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల కొత్తగా ఓటు హక్కు కలిగిన కొత్త ఓటర్లతో కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావుతో కలిసి అవగహన కార్యక్రమాన్ని చేపట్టారు. అదే విధంగా సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల మైదానంలో రంగవల్లులు, బతుకమ్మలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే 100నిమిషాల్లో చర్యలు ఉంటాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 30వరకు ఓటు హక్కుకై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, అధ్యాపకులు దుర్గాప్రసాద్, పార్థసారధి, ఎంపీడీఓ జయరాం, ఎంఈఓ బి.రాములు, సీడీపీఓ ఎ.కొండమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మెప్మా సీఓలు ప్రసాద్, నరేష్, ఏఓ శ్రీనివాస్, ఏఈఓలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు వాడవాడలా బతుకమ్మ ఆడారు. దసరా ఉత్సవాలలో భాగంగా పలు మండలాల్లోని అన్ని గ్రామాల్లో బతుకమ్మల వద్ద ఆటపాటలతో సందడి చేశారు. మహిళలు, పిల్లలు, యువతులు కోలాట నృత్యాలు చేస్తూ.. రకరకాల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు..



చింతకాని: మండల పరిషత్ కార్యాలయంలో..



వైరా: ఠాగూర్ విద్యాలయం యాజమాన్యంతో కలిసి కోలాటం ఆడుతున్న ఎస్సై మేడా ప్రసాద్



కొణిజర్లలో ఐకేపీ ఆధ్వర్యంలో.. బతుకమ్మ వేడుకలు



తల్లాడ: కోలాటం ఆడుతున్న మహిళలు



సత్తుపల్లి: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో..

బీఆర్ఎస్ నాయకులతో మంతనాలు

వైరారూరల్: మండలంలోని కేజీ సిరపురం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్‌కు చెందిన పుణ్యపురం సర్పంచ్ గాదె మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు, ముఖ్య నాయకులను వైరా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న బానోత్ విజయబాయి, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌లు మర్యాద పూర్వకంగా కలుసి మంతనాలు జరుపుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు మట్టూరి నాగేశ్వరరావు, గొల్ల వెంకటేశ్వరరావు, మట్టూరి గోపాలకృష్ణయ్య, గంగా సూర్యప్రకాష్, కొత్తపల్లి చిన్న వెంకటేశ్వర్లు, కూరకుల రాంబాబు తదితరులు ఉన్నారు.

పరామర్శ..

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డులో అనారోగ్యానికి గురైన ఏన్కూరు ఎంపీటీసీ శెట్టిపల్లి రాధమ్మను ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటి చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, సొసైటి చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

కారేపల్లి: దేవీశర న్నవరాత్రుల్లో భాగంగా.. కారేపల్లి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద సింగరేణి సర్పంచ్ ఆదెర్ల స్రవంతి చేతుల మీదుగా మహిళా భక్తులకు 60 చీరలను బుధవారం పంపిణీ చేశారు. అదే విధంగా.. దుర్గాదేవి కమిటీ సభ్యులు పిల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 24న మహాచండీ యాగం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. అంతకు ముందు అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమియ్యగా, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

ఎర్రుపాలెం: మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు, షుగర్, బీపీ, తదితర వ్యాధులతో బాధపడుతున్న 79 మంది రోగులకు డాక్టర్ వీరబాబు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసిపల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ దోమందుల సామేలు, హెచ్ఈఓ సదాశివరావు, సూపర్‌వైజర్లు పద్మావతి, వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం నాగమణి, సెక్రటరీ శివకుమార్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక రచయితలకు సత్కారం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయంలో బుధవారం శ్రీమల్లిక రమణీయం పుస్తక రచయితలు పి.మల్లికార్జునశర్మ, రమణమూర్తి, కల్యాణశర్మలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కె.అప్పారావు, ఉపాధ్యక్షులు ఎంఎస్ఆర్ శర్మ, కె.జగన్మోహన్‌రావు, ఎల్ఎస్ రావు, పి.రమణారావు, ఎ.శ్రీనివాసరావు, వినోదరావు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేస్తాం

ఎర్రుపాలెం: మధిర పీటంపై గులాబీ జెండా ఎగురవేస్తామని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని గుంటుపల్లి, గోపవరం గ్రామాల్లో జరిగిన మండల స్థాయి బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకుల సమావేశాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు మీలో ఒకడిగా ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మంచి స్పందన లభిస్తుందని.. మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంగా కేసీఆర్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీకై పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానన్నారు. బూత్ స్థాయి కన్వీనర్లు, పార్టీ శ్రేణులు ప్రతి గడపకు వెళ్లి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అంతకుముందుగా నిర్వహించిన ప్రచారంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు.



మాట్లాడుతున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, పక్కన కమల్‌రాజ్, తదితరులు

కార్యక్రమంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, అప్పారావు, జయలక్ష్మి, ఎంపీటీసీలు కృష్ణారావు, వసస్తాన్‌వలీ, నాయకులు కోటేశ్వరరావు, హుస్సేన్, బాబుసా, స్టాలిన్, పుల్లారెడ్డి, సంజీవరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలను వివరించండి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

ఏన్కూరు: మండలంలోని కార్యకర్తలందరు ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి కేసీఆర్ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను వివరించాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తలు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, ఎంపీటీసీ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, సరోజిని, ప్రమీల, సర్పంచులు చిర్రా రుక్మిణి, ప్రసాద్, శివ, వినోద్‌కుమార్, మల్లేష్, హరిసింగ్, గంసి, నాయకులు మోహన్‌రావు, హరికృష్ణ, రమేష్, జలాల్‌ఖాన్, కోటేశ్వరరావు, బాలాజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కొండూరు సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, దొడ్డా సత్యనారాయణ, దొడ్డా అమ్ములు, మందపాటి రవీందర్‌రెడ్డి, కొత్తూరు కోటేశ్వరరావు, కిషోర్, కర్నాటి వెంకటనారాయణరెడ్డి, నాయుడు రాఘవరావు, అల్లు కృష్ణారెడ్డి, గుగులోత్ భాషానాయక్, మారబోయిన ప్రసాద్, కాలినేని సత్యనారాయణ, అల్లిక సాంబశివరావు, శేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, సాధు శ్రీనివాసరావు, గంటి జగన్, రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యంలో..

పట్టణంలోని కల్పతరురోడ్‌లో కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి కాంగ్రెస్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎండి కమల్‌పాషా, నారాయణవరపు శ్రీనివాస్, మానుకోట ప్రసాద్, నరుకుళ్ల అప్పారావు, ఎండి ఫయాజ్, మొరిశెట్టి సాంబశివరావు, సందీప్, నాగభూషణం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బేతుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కొండూరు సుధాకర్

ఎండుతున్న పంటలను కాపాడాలి



కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: నియోజకవర్గంలోని సాగర్ ఆయకట్టు కింద కల్లూరు, తల్లాడ మండలాల్లో వరి పొలాలకు సాగునీరు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కల్లూరు మండలంలోని కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద సాగునీటిని రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. నెల రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశమున్నందున సాగునీటి సరఫరా కొనసాగించాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ గుమ్మా రామకృష్ణ, వీరంరాజు, మట్ట ప్రసాద్, గుండపనేని అనిల్, పుల్లారావు, బోడ మహేష్, ఆనంగి నర్సింహారావు, వెంకటరెడ్డి, సంజీవరావు, ఆనంద్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యం..

తల్లాడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి నంబూరి రామలింగేశ్వర్‌రావు సూచించారు. తల్లాడలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓటు వేసేలా చూడాలని తెలిపారు. నాయకులు మట్టా ప్రసాద్, తేజావత్ బాలాజీనాయక్, నన్నపనేని శారద, గాదె కృష్ణారావు, రాయల రమేష్, చౌడా నాగేశ్వర్‌రావు, ఎల్లంకి సుధాకర్, గొల్లమందల సురేష్, వేముల వెంకటరామయ్య పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి దేవిగా.. అమ్మవారు

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నాలుగోరోజు కావడంతో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి, అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి.. చక్కెర పాయసం, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించి.. అమ్మవారి విశిష్టతను వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: కోదండ రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



మధిర: కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ



పెనుబల్లి: వీఎంబంజర్ బాలుస్వామి ఆశ్రమంలో..



వైరారూరల్: ముసలిమడుగులో..



చింతకాని: మత్కేపల్లి గ్రామంలో



సత్తుపల్లిటౌన్ శ్రీమహాలక్ష్మి దేవిగా..



బోనకల్‌లో అన్నపూర్ణాదేవిగా..



తల్లాడలో..